క్లుప్తంగా

అధిక దిగుబడులకు ప్రకృతి వ్యవసాయం

పాకాల: ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం ద్వారా నాణ్యమైన పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు రాధాదేవి పేర్కొన్నారు. బుధవారం వల్లివేడు గ్రామంలో ఆత్మ చిత్తూరు వారి సహకారంతో, జిల్లా వనరుల కేంద్రం అధికారులు రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రాధాదేవి మాట్లాడుతూ వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయంలో అధికారుల సూచనలు పాటించడం ద్వారా పంట దిగుబడుల్లో నష్టాలు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం రైతులు తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. జిల్లా వనరుల కేంద్రం తిరుపతి సిబ్బంది ఏఓ పుష్పావతి, స్థానికులు పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తం



విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ కుసుమ

చంద్రగిరి: అతిసారంపై అప్రమత్తంగా వ్యవహరించాలని చంద్రగిరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూచించారు. బుధవారం చంద్రగిరిలోని ప్రభుత్వ హాస్టల్స్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అతిసారం ప్రబలుతోందని, ప్రతి ఒక్క హాస్టల్ వార్డన్ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు తాగేందుకు ఇవ్వాలన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్యామల, వాసుదేవ, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టైంస్కేల్ ఉద్యోగి మృతి



వెంకటరమణ (ఫైల్)

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంసీఏ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టైంస్కేల్ ఉద్యోగి వెంకటరమణ(56) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతికి టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సహచర సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

కొత్త చట్టాలు రద్దు చేయండి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి అర్బన్: కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఒక విషయంపై చట్టం చేయాలన్నా లేక ఉన్న చట్టంలో సవరణ చేయాలన్న ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలని చెప్పారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, వేణుగోపాల్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి పాల్గొన్నారు.

బాలగుర్రప్పస్వామి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 19న ఏకాదశి మహోత్సవం



ఆలయ గర్భగుడిలో స్వామివారు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని లంకిపల్లెవారిపల్లెలోని శ్రీబాలగుర్రప్పస్వామి ఏకాదశి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. శ్రీ బాలగుర్రప్పస్వామికి చాలా విశిష్టత ఉంది. స్వామివారు ఈ గ్రామంలో వెలసింది మొదలు గ్రామస్తులు దినదినాభివృద్ధి చెందుతున్నారని చెబుతారు. గత పద మూడు సంవత్సరాలుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. గత ఏడాది జరిగిన ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. దీంతో లంకిపల్లెవారిపల్లె గ్రామస్తులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఏకాదశి మహోత్సవం రోజున స్వామివారికి మొక్కులు చెల్లింపులు, తలనీలాలు సమర్పణ, పొంగళ్లు కార్యక్రమాలు ఉంటాయని గ్రామ పెద్దలు తెలియజేశారు.

అభివృద్ధే అజెండాగా పనిచేద్దాం

- కౌన్సిల్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష
- 36 అంశాలకు ఆమోదముద్ర
- హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- నగరాభివృద్ధికి సహకరించాలని తీర్మానం





సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి సిటీ: నగరాభివృద్ధే అజెండాగా ప్రతి కౌన్సిల్ సభ్యుడు పనిచేయాల్సిన అవసరం ఉందని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి కమిషనర్ అదితిసింగ్, ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. మేయర్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ తిరుపతి నగరపాలక సంస్థకు దేశంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. వివాదరహితంగా కౌన్సిల్ సభ్యులు నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధిని కొనసాగించేందుకు నూతన ప్రభుత్వం సహకరించాలని కోరారు. టీటీడీ నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, ఈఓ సహాయ సహకారాలు ఎంతో అవసరమన్నారు.

దేశం తిరుపతి వైపు చూస్తోంది

ఎక్స్ అఫిషియో మెంబర్ హోదాలో ఎంపీ ఎం. గురుమూర్తి మాట్లాడుతూ యావత్ దేశం తిరుపతి వైపు చూస్తోందన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి



హాజరైన కార్పొరేటర్లు

చేసేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. ఇప్పటికే సీఎం జగనన్న పాలనలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నగరం మోడల్ సిటీగా అభివృద్ధి చెందడానికి కొత్త ప్రభుత్వం ప్రయత్నించాలన్నారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని కొనసాగించాలి, ఎన్నడూ లేనివిధంగా గత ప్రభుత్వ హయాంలో రూ.17వేల కోట్లతో 742 కిమీ జాతీయ రహదారిని తీసుకొచ్చామన్నారు. అందరం కలసికట్టుగా కృషి చేస్తే నగరాన్ని దేశంలోనే నంబర్ ఒన్ మోడల్ సిటీగా నిలబెట్టవచ్చన్నారు. తిరుపతి అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తానని, సమస్యలు పార్లమెంటులో చర్చించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మెడికల్ హబ్‌గా తిరుపతి నగరం

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కార్పొరేషన్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించేలా ప్రతి కౌన్సిల్ సభ్యులు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో కౌన్సిల్ సమావేశానికి హాజరుకావడం సంతోషంగా ఉందని నగరాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు.

రాజకీయాలకు అతీతంగా కలసి పనిచేద్దాం

తిరుపతి ఆధ్యాత్మిక నగరంగా ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని, ఆ పేరు ప్రతిష్ఠలను మరింత పెంచేందుకు అందరం కృషిచేయాల్సి అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి పేర్కొన్నారు. నగరాభివృద్ధికి రాజకీయాలకతీతంగా కలసి పనిచేద్దామన్నారు. నగరాభివృద్ధికి పూర్తి సహకారం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

36 అంశాలకు ఆమోదముద్ర

తిరుపతి ప్రజలకు, తిరుమల యాత్రికులకు తాగునీరు అందించే కండలేరు జలాశయం నీటి నిల్వలు పడిపోవడంతో డెడ్ స్టోరేజీ నీటిని రూ.85లక్షలు ఖర్చుతో కండలేరు జలాశయం నందుగల అప్రోచ్ చానల్ పూడిక తీయడం ద్వారా 33రోజుల పాటు నగరానికి నీటి సరఫరా చేయవచ్చనే ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోద ముద్రవేసింది. నగరంలోని పలు వీధుల్లో డ్రైనేజీ కనెక్షన్లు వంటి 36 అంశాల మీద కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ అతిథి సింగ్ మాట్లాడుతూ అభివృద్ధి అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు. కార్పొరేటర్లు తెలియజేసే సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసలను కార్పొరేటర్లు ఘనంగా దుశ్శాలువలతో సన్మానించారు.

స్విమ్స్ పీహెచ్‌డీ విద్యార్థినికి అవార్డు



శివరంజనిని అభినందిస్తున్న ఆర్‌వీ.కుమార్

తిరుపతి కల్చరల్: స్విమ్స్ బయో ఇన్ఫర్మాటిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న పి.శివరంజనికి బెస్ట్ పేపర్ అవార్డు లభించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. బయో ఇన్ఫర్మాటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమినేని ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ చేస్తున్న శివరంజనికి భారతీయ ఫార్మాసూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రొఫెసర్ ఎంఎల్.ఖోరానా ఉత్తమ పేపర్ అవార్డును అందజేశారని పేర్కొన్నారు. ఈమేరకు స్విమ్స్ బయోఇన్ఫర్మాటిక్స్‌లో బుధవారం పి.శిరంజనిని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ.కుమార్‌తో పాటు బయో ఇన్ఫర్మాటిక్స్ ప్రొఫెసర్లు, డాక్టర్లు, సిబ్బంది అభినందించారు.

ఫేక్ ఆఫర్లతో మా కడుపులు కొట్టొద్దు

తిరుపతి కల్చరల్: స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్ సమీపంలోని ఒక ప్రముఖ మొబైల్ షాప్‌లో ఫేక్ ఆఫర్లతో జనాన్ని మోసం చేస్తున్నారని, ఇలాంటి వాటితో తమ వ్యాపారాలకు గండికొడుతున్నారని తిరుపతి మొబైల్స్ షాపుల అసోసియేషన్ నేతలు ఆరోపించారు. ఈమేరకు బుధవారం సాయంత్రం ఆ షాపు వద్ద అసోసియేషన్ నేతలు బ్యానర్ పట్టుకొని దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ షాపు ఓపెనింగ్ నుంచి ఫేక్ ఆఫర్లతో కస్టమర్లను మోసం చేస్తున్నారని, ఈ షోరూంలో మొబైల్స్ కొనుగోలు వేయవద్దని కొనుగోలుదారులను నిరసన కారులు అభ్యర్థించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మున్న, చేతన్, లోకేష్, కుమార్, కిషోర్, మహేష్, శీను పాల్గొన్నారు.

శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించండి



ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయికి వినతి పత్రం ఇస్తున్న నేతలు

తిరుపతి సిటీ: తిరుపతి అర్బన్ శెట్టిపల్లి రెవెన్యూ గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న ఇంటి స్థలాల, భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు సుబ్రమణ్యం విన్నవించారు. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా జరిగిన తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో విచ్చేసిన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి భూ బాధితులు, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



డీటీకి వినతి పత్రాన్ని ఇస్తున్న నేతలు, కార్మికులు

పాకాల: ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు మదుసూధన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుటు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులతో కలసి ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని కోరారు. అనంతరం డీటీ పరదేశికి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ ప్రసాద్, రైతు నేత కేశవ రెడ్డి, మహిళా సంఘం నాయకురాలు సుగుణమ్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు షకీల, షఫియా, భాను, మమత, మరియాంబి పాల్గొన్నారు.

శిల్పారామంలో హస్తకళా మేళా



మేళాను ప్రారంభిస్తున్న ఏఓ ఖాదర్‌వల్లీ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో చేనేత, హస్తకళా మేళాను నిర్వహిస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వల్లీ తెలిపారు. తిరుపతి సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం చేనేత, హస్తకళా మేళాను ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి 27 మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకం కోసం అందుబాటులో ఉంచారన్నారు. తిరుపతి నగర ప్రజలు చేనేత, హస్తకళలను ఆదరించాలని కోరారు. సెక్రటరీ సంస్కృతి కల్చరల్ క్రాఫ్ట్ సొసైటీ నిర్వాహకుడు మహేష్, కళాకారులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటిని అందించాలి



ట్యాంకులను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

- కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: నగరంలోని ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళం, అలిపిరి వద్దనున్న వాటర్ ఫిల్టర్ ప్లాంట్లను, మున్సిపల్ పార్కు, లీలా మహల్ సమీపంలోని నీటి సరఫరా ట్యాంకులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కల్యాణి డ్యాం నుంచి నీటి పంపింగ్ తోపాటు ఫిల్టర్ చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ రోజూ నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే అన్ని ట్యాంకులను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి నీటిని నింపి సరఫరా చేయాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు శ్రావణి, తేజస్విని పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న గీత

చంద్రగిరి: చదువుకు దూరంగా బడిబయట ఉన్న పిల్లల భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఓఎస్‌సీ రాష్ట్ర సలహాదారురాలు గీత అన్నారు. మండల పరిధిలోని చంద్రగిరి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు విద్యపై ఆరా తీశారు. అనంతరం మిట్టపాలెంలోని ఐదుగురు బడి బయట పిల్లలకు ప్రభుత్వం అందించిన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఆమె వెంట తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సురేష్, ఏఎల్ఎస్‌సీఓ శ్రీధర్, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, శ్యామల, గౌరీ, గురుప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న అమ్ములు కుమారి

తిరుపతి కల్చరల్: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సాయినగర్ పంచాయతీ, లింగేశ్వర్‌నగర్‌కు చెందిన డ్వాక్రా మహిళలు అమ్ములు కుమారి, హేమలత డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిత్తూరుకు చెందిన టి.కుమారి, టి.అర్జున్‌రెడ్డి కుమార్తె హరిత(17) చంద్రగిరి మండలం, భీమరానికి చెందిన కె.చంద్రకళ, కె.హరిహరరెడ్డి కుమారుడు కె.పురుషోత్తంరెడ్డికి గత నెల 9న తొండవాడ గ్రామంలోని శ్రీషిరిడీ సాయిబాబా గుడిలో వివాహం జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని తాము పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డుకున్నామని తెలిపారు. అయినా వివాహం చేశారని పేర్కొన్నారు. తాము చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వివరాలు సేకరించాలని చంద్రగిరి ఎస్ఐ ఆదేశించారని తెలిపారు. ఐసీడీఎస్ వారు వెళ్లి విచారించి వివాహం జరగలేదని పోలీసులకు రాతపూర్వకంగా ఇచ్చారని తెలిపారు. వివాహం జరిగిందని సాక్ష్యాధారాలను ఐసీడీఎస్ సూపర్ వైజర్‌కు ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. ఐసీడీఎస్ సిబ్బందిపై పీడీ, జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళా సభ్యులు బేబి, కవిత, హంసవేణి, సుజాత పాల్గొన్నారు.

శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో అమ్మవారు



స్వప్నవారాహి దేవికి పూజలు చేస్తున్న మాతాజీ

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీ శ్వేత వారాహిదేవి అమ్మవారు బుధవారం శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతి పీఠంలో కొలువైన వారాహీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేదపండితులు మంత్రాలతో హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.



పూజలో పాల్గొన్న భక్తులు

ప్రేక్షకులను సినిమాకు రప్పించడమే పెద్ద సవాల్

- సామాజిక స్పృహతో శంకర్ చిత్రాలు
- ప్రముఖ సినీ నిర్మాత సురేష్ బాబు



శ్రీవారిని దర్శించుకున్న సురేష్ బాబు, మలినేని గోపీచంద్, తమన్

తిరుమల: సినిమా టికెట్ల ధర పెంపుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారని, అయితే ప్రస్తుతం టికెట్ల ధర కంటే ప్రేక్షకులను సినిమాకు రప్పించడమే తమ ముందు ఉన్న పెద్ద సవాల్ అని ప్రముఖ సినీ నిర్మాత సురేష్ తెలిపారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు డైరెక్టర్ మలినేని గోపీచంద్, సంగీత దర్శకుడు తమన్ కూడా దర్శించుకున్నారు. దర్శనానంతరం అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్ దర్శకత్వం వహించిన భారతీయుడు 2 చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నట్టు చెప్పారు. సామాజిక స్పృహతో శంకర్ తీసే చిత్రాల తరహాలోనే ప్రతి ఒక్కరూ సమాజం కోసం తమవంతు బాధ్యతగా పని చేయాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన ముఖ్యం



జనాభా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఆరోగ్యంపై అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో కలసి ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల నుంచే ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు–బిడ్డకు మధ్య అంతరం, బాల్య వివాహాల మూలాన కలిగే అనర్థాలు..ఇత్యాది అంశాలపై కుటుంబ ప్రణాళిక ఉండాలన్నారు. ఆ ప్రణాళికే అభివృద్ధి చెందుతున్న భారత దేశానికి గుర్తింపు అని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, వైద్యాధికారులు శ్రీనివాసరావు, లావణ్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న బండి సంజయ్

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకోనున్నారు. బుధవారం తిరుమలకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వరాహస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు ఆయనకు దర్శనం ఏర్పాట్లు చేశారు.

సిగరెట్లు విక్రయిస్తే జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించే వారికి పోలీసులు బుధవారం జరిమానా విధించారు. పాఠశాలలు, కళాశాలలు విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించకూడదన్నారు. ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరిక లేకుండా సిగరెట్, బీడీలు అమ్ముతున్న దుకాణాదారులకు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.200 జరిమానా విధించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్
- పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని



మంగళంలో మురుగును తొలగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని

తిరుపతి మంగళం: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం మంగళంలోని పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలసి కలెక్టర్ పాల్గొని పరిసరాలలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డే పాటించడం ద్వారా డయేరియా, డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి రోగాల బారిన పడకుండా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పంచాయతీ ఇంచార్జ్ అధికారిణి సుశీలదేవి, డివిజనల్ పంచాయతీ అధికారిని రూపారాణి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీఐఓ శాంతకుమారి పాల్గొన్నారు.